విచ్చలవిడిగా పచ్చదనం ధ్వంసం

- పశువులకు మేతగా మొక్కలు
- పరిరక్షించాలంటున్న ప్రకృతి ప్రేమికులు


పీఆర్ కళాశాల ఆవరణలో చెట్టుకింద సేదతీరుతున్న పశువులు


డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలు కొరికేస్తున్న పశువులు

బాలాజీచెరువు: స్మార్ట్‌సిటీగా అందమైన నగరంగా తీర్చుదిద్దుకుంటున్న కాకినాడ నగరాన్ని ప్రధానం వేధిస్తున్న సమస్య పశువుల సంచారం. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్ని సమయాల్లో ఇష్టానుసారంగా ప్రధాన రహదారులు, విద్యాలయాల ఆవరణలో సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఉదయం వేళ్లలో మార్కెట్లో అడ్డంగా ఉండి కూరగాయలకు వచ్చేవాళ్లకు పెదమార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్ రైతు బజార్ వంటి ప్రాంతాలలో గుంపులుగా ఏర్పడి అసౌకర్యాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఇక మధ్యాహ్నం, సాయంత్రం వేళ్లలో అయితే ప్రధాన రహదాదారులు జీజీహెచ్, ఇంద్రపాలెం బ్రిడ్జి, బాలాజీచెరువు, భానుగుడి, జేఎన్‌టీయూ కూడలి, నాగమల్లితోట జంక్షన్ వంటి ప్రాంతాల్లో 20 నుండి 30 వరకూ గుంపులుగా సంచరిస్తూ రోడ్డు మధ్యలో తిష్టవేస్తాయి. దీంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఒక్కోసారి వాహన చోదకులపైకి రావడంతో ప్రమాదాలు బారిన పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

ఆహ్లాదం కరవు

నగరంలో ప్రధాన రహదారుల్లో దాదాపుగా ఐదు కిలో మీటర్ల మేర రోడ్డు డివైడర్ వేసి మధ్యలో స్మార్ట్‌సిటీ నిధులతో లక్షలు వెచ్చించి పచ్చని గడ్డి వేసి ఆధునీకరించారు. వాటిని పశువులు ధ్వంసం చేస్తూ వ్యర్థాలతో అపరిశుభ్రం చేస్తున్నాయి. సుందరీకరణ కోసం వేసిన మొక్కలు సైతం పాడుచేయడంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసినవి వృథాగా పోతున్నాయి. పశువుల యజమానులను కార్పొరేషన్ అధికారులు హెచ్చరించినా రెండు మూడు రోజుల తరువాత యథావిధిగా దర్శనమిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. వీటిపై మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్‌ను వివరణ కోరగా పశువుల యాజమానులకు సమాచారం ఇచ్చి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కలను సంరక్షించాలి



నగరంలో పశువుల సంచారం ఇటీవల కాలంలో అధికమైంది. ముఖ్యంగా వాహనాలకు అడ్డంగావచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతోపాటు వాటి వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు.
రోడ్ల మధ్యలో పచ్చదనం కోసం వేసిన మొక్కలు, గడ్డి ఆహారంగా పనికిరాకపోయినా వాటిని కొరికివేయడంతో పచ్చదనం ధ్వంసమవుతోంది. రూ.లక్షలు వెచ్చించి నాటిన మొక్కలు మూణ్ణాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. వచ్చే వేసవికాలం దృష్ట్యా ఇటువంటి వాటిపై దృష్టి పెట్టి పశువులు పాడు చేయకుండా కాపాడాలని కోరుతున్నాము.
– ఎస్.సురేఖ, ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు

ఎమ్మెల్సీ చిక్కాలను సత్కరించిన మంత్రి అప్పలరాజు


చిక్కాలను సత్కరిస్తున్న మంత్రులు అప్పలరాజు, రాజా, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

కాకినాడ సిటీ: వివాదరహితునిగా, సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉంటూ ఇటు రాజకీయ వర్గాల్లోను, అటు ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు అభినందనీయులని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో త్వరలో ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావును సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మంచి వ్యక్తిగా రాజకీయాల్లో ఓ సుస్థిర స్థానం ఏర్పర్చుకున్నారన్నారు. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, శాసనమండలి సభ్యులు అనంత ఉదయభాస్కర్, శాసన సభ్యులు కురసాల కన్నబాబు, నిమ్మకాయల చినరాజప్ప ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావును సత్కరించారు.

క్లుప్తంగా

కార్యదర్శులపై చర్యలు

కాకినాడ: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు శుక్రవారం పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. 38వ డివిజన్ పరిధిలోని గొల్లపేట ప్రాంతంలో పర్యటించిన ఆయన... కొన్నిచోట్ల డ్రైనేజీలలో చెత్త నిలిచి ఉండడాన్ని గుర్తించారు. ఎన్నిసార్లు చెప్పినా ప్రజలు చెత్తను డ్రైనేజీలలోనే వేయడం, పర్యవేక్షించాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంపై ఏడీసీ అసహనం వ్యక్తం చేశారు. డ్రైన్లలో చెత్త వేయడం వల్ల మురికినీటి పారుదలకు ఆటంకంగా మారి దోమల సమస్య ఎదురవుతోందన్నారు. పర్యవేక్షించాల్సిన సిబ్బంది అలసత్వంపై మండిపడ్డ అదనపు కమిషనర్ అక్కడి శానిటరీ సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటి వద్దకే పారిశుధ్య వాహనాలు, సిబ్బంది వస్తున్నప్పుడు రోడ్లపైన, డ్రైనేజీలలో చెత్తను ఎందుకు వేస్తున్నారంటూ ప్రశ్నించారు. అటువంటి వారిని గుర్తించి అవగాహన కల్పించాలని, మార్పు రాకపోతే జరిమానాలు విధించాలని ఏడీసీ ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవివర్మ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

ఐఎన్‌టీఎస్ ఒలంపియాడ్ విజేతలకు అభినందనలు

బాలాజీచెరువు: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ (ఐఎన్‌టీఎస్) ఒలంపియాడ్ నిర్వహించిన ద్వితీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ చూపిన శ్రీచైతన్య విద్యార్థులను కాకినాడ జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు అభినందించారు. శుక్రవారం తన కార్యాలయంలో కలసిన 70మంది ప్రతిభను మెచ్చుకున్నారు. విద్యార్థులకు ప్రత్యేక టెక్నో కరిక్యులమ్ నిర్వహించడం వల్ల ఫలితాలు సాధ్యమవుతున్నాయని ఉత్తరాంధ్ర ఏజీఎం ఎంవీ సురేష్ పేర్కొన్నారు. విద్యార్థులను ఆర్‌వి గోపినాథ్, ప్రిన్సిపాల్ సుల్తానా, కో–ఆర్డినేటర్ శ్రీకాంత్ అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై అభ్యంతరం

కరప: స్థానిక శివాలయం వీధిలో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిర్ణయంపై ఆ సంఘం నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనం వద్ద విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు అక్కడ ఇసుక, సిమెంట్ ఇటుకలు దింపించి, శుక్రవారం నిర్మాణ పనులు చేపట్టింది. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే తరచుగా ప్రమాదాలు జరిగే అవకాశముందని, ఎవరికీ ప్రమాదంలేని ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని, లేకపోతే భవన నిర్మాణ కార్మికులందరూ కల్సి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తూ కరప విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సంఘ నాయకులు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

కాకినాడ రూరల్: కాకినాడ – పిఠాపురం రోడ్డులో మండల పరిధిలోని రమణయ్యపేట పంచాయతీ రాయుడుపాలెం జంక్షన్ వద్ద శ్రీ విశ్వకాంతి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజరు ఫణీంద్ర ప్రారంభించారు. నిర్వాహకులు అడబాల శ్రీనివాస్, స్వర్ణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట మెయిన్‌రోడ్డులో లయన్స్ క్లబ్ కాకినాడ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. లయన్ డాక్టర్ బాదం బాలకృష్ణ ప్రారంభించారు. చార్టర్ ప్రెసిడెంట్ గంటి భాస్కరరావు, కార్యదర్శి గ్రంధి సతీష్, కోశాధికారి బి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు మృతికి నివాళి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ సెరిబ్రల్ బ్రెయిన్ హెమరేజ్‌తో మృతి చెందిన గుత్తుల రమాదుర్గకు శుక్రవారం ఆసుపత్రి యాజమాన్యం నివాళులర్పించింది. జీజీహెచ్‌లోని కమ్యూనిటీ హాల్లో కాంట్రాక్టు బేసిస్, రెగ్యులర్ నర్సింగ్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయ కుమార్, డాక్టర్ వెంకటరెడ్డి, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్‌లు హాజరయ్యారు. రమాదుర్గ తల్లి సుబ్బలక్ష్మి తన కుమార్తెకు నర్సింగ్ వృత్తి పట్ల ఉన్న నిబద్ధతను తెలుపుతూ భావోద్వేగానికి గురయ్యారు.

29న అఖిలపక్ష సభ

కాకినాడ సిటీ: ఈ నెల 29వ తేదీన కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీసీ నాయకులతో కాకినాడ సూర్యకళామందిరంలో అఖిలపక్ష మహాసభ నిర్వహిస్తున్నట్లు టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ శుక్రవారం కాకినాడలో తెలిపారు.

సంపద తయారీ కేంద్రాలపై దృష్టి

కరప: గ్రామ పంచాయతీలకు ఆదాయం చేకూర్చే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మండల ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. కూరాడ, నడకుదురు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. సంపద తయారీ కేంద్రాలు, పారిశుధ్య పనుల నిర్వహణ, మంచినీటి ట్యాంక్‌ల పరిశుభ్రత తదితర కార్యకలాపాలను పరిశీలించి, ఆయన పలు సూచనలు చేశారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య పనులు నిర్వహించేటప్పుడు తడి, పొడి చెత్త విడిగా సేకరించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించి, వర్మీకంపోస్టు ఎరువును తయారుచేసి, ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు సూచనలు చేశారు. గ్రామకార్యదర్శులు పి.రవి, పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కన్నబాబు


ఓ ఇంటి వద్ద స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ సిటీ: నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, పాలన తీరు గత ప్రభుత్వాలతో పోల్చి చూడాలని, మరోసారి జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రజలను కోరారు. శుక్రవారం కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు పంచాయతీ తారకరామనగర్‌లో ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు గ్రామ సర్పంచ్ పిల్లి చక్రరావు, ఉపసర్పంచ్ పబ్బిసెట్టి రమేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు కొండేటి లీలావతి, ఊబా నాగమణి, వార్డు సభ్యులు, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలతో సమావేశమై స్థానిక సమస్యలపై చర్చించారు. 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నా నేటికి పట్టాలు పొందలేని కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని స్థానికులు ఎమ్మెల్యే కన్నబాబును కోరడంతో ఆర్డీవో బి.వెంకటరమణ, తహసీల్దార్ మురార్జీతో గ్రామంలో అర్హులైన వారికి పట్టాలు అందించే చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్డీవో, తహసీల్దార్లతో గ్రామంలో తిరిగి పలు సమస్యల పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. పట్టాలు ఇస్తామని, గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కన్నబాబు వివరించారు.

హుషారుగా జగనన్నే మా భవిష్యత్తు

కరప: మండల పరిధిలోని పలుగ్రామాల్లో శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామవలంటీర్లు, పార్టీ శ్రేణులతో కలసి జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమాన్ని హుషారుగా నిర్వహించారు. యండమూరు, విజయరాయుడుపాలెం, పెదకొత్తూరు తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారా, ఆయనకు వచ్చేఎన్నికల్లో కూడా మదద్దతు ఇస్తారా అంటూ ప్రశ్నలు వేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనే మళ్లీ, మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, అందుకు జగనన్నే మానమ్మకం అంటూ గృహిణులు మద్దతు ప్రకటించారు. తమ ఇంటి తలుపులపైన, గేట్లపైన జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించుకున్నారు. తమ మొబైల్ ఫోన్ల నుంచి మిస్డ్ కాల్స్ ఇచ్చి జగనన్న పాలనకు మద్దతు ప్రకటించారు. కొంతమంది జగనన్న స్టిక్కర్లను తమ మొబైల్ ఫోన్లపై అతికించుకుని, అభిమానాన్ని చాటుకున్నారు. పెదకొత్తూరులో అయితే ఇంటి స్థలమిచ్చారు, పిల్లలను చదివించమని అమ్మ ఒడి ఇస్తున్నారు, వైఎస్సార్ చేయూత, పెన్షన్ కానుక, సున్నావడ్డీ ఇన్ని పథకాలు ఇస్తున్న జగనన్నే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉండాలంటూ తాతపూడి చంద్రమ్మ సీఎం జగన్ స్టిక్కర్‌కు దణ్ణం పెట్టి, తన అభిమానాన్ని చాటుకున్నారు. సర్పంచ్‌లు మారెళ్ల శ్రీనివాస్(శివ), వెలుగుబంటి సీతారామరాఘవ, చింతా నాగలక్ష్మి, బుజ్జి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, రొక్కాల గణేష్ పాల్గొన్నారు.

అల్లా అనుగ్రహంతో ప్రగతి మార్గం


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: అల్లా ఆశీస్సులు, అనుగ్రహంతో అందరికీ మంచి జరగాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక కొత్తపేట మార్కెట్ వద్ద నగీనా మస్జిద్‌లో శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్నేహభావానికి, దాతృత్వానికి ప్రతీకగా నిలిచేలా రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీరికి అల్లా ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ కాకినాడలోని ముస్లిం మైనార్టీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు కరీముల్లా ఖాన్, కార్యదర్శి సలీముద్దీన్, ఉపాధ్యక్షుడు ఇక్బాల్ ఆలీ, మైనార్టీసెల్ ప్రాంతీయ సమన్వయకర్త అబ్దుల్‌బషీరుద్దీన్, నగర మైనార్టీసెల్ అధ్యక్షుడు ఖాలీద్‌బిన్ వలీ, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ రోకళ్ళ సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్, మైనార్టీ సెల్ ప్రాంతీయ సమన్వయకర్త అబ్దుల్‌బషీరుద్దీన్ పుట్టినరోజు సందర్భంగా ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో కేక్ కట్ చేశారు.

రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం

- కొవ్వాడలో గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు


పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి జగన్ నడుపుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్న పథకాల ద్వారా అందించిన లబ్ధిని గ్రామస్తులకు వివరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొవ్వాడలో నాలుగో రోజు శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని మధురానగర్, సిద్ధి వినాయక నగర్, మిత్రవానికాలనీ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించి, ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలియజేశారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ కొవ్వాడ గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో నాలుగు రోజులుగా గడప గడపకూ కార్యక్రమం అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాల సిబ్బంది, వలంటీర్లతో కలిసి నిర్వహించామన్నారు. గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు, రోడ్లు, డ్రైనేజీలు, తదితర సమస్యలు తెలియజేశారని వాటిని పరిష్కరిస్తామన్నారు. గ్రామంలోని ఎక్కువ మంది ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. ముఖ్యంగా వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్ అందించడంతో వృద్ధులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపుశెట్టి పద్మజ బాబ్జీ, ఉప సర్పంచ్ తోటకూర శ్రీనివాస్ పాల్గొన్నారు.

లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ పరిశీలన

- డంపింగ్ యార్డ్ సందర్శించిన కమిషనర్ మహేష్


డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల శుక్రవారం సంజయ్‌నగర్‌లోని డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని సందర్శించారు. ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీఈ మాధవి, ఇతర అధికారులతో కలిసి అక్కడకు వెళ్లిన కమిషనర్ లెగసీ వేస్ట్ (ఎన్నో ఏళ్లుగా డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన అన్ని రకాల చెత్త) ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించారు. యంత్రాల ద్వారా అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. దాదాపు 3,62,375 మెట్రిక్ టన్నుల లెగసి వేస్ట్ ప్రాసెసింగ్ ప్రక్రియ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ భాగస్వామ్యంతో ప్రారంభించినట్లు డీఈ మాధవి కమిషనర్‌కు వివరించారు. అంతకుముందు ప్రతాప్‌నగర్ ప్రాంతంలో పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. మస్తరు కేంద్రంలో సిబ్బంది హాజరును పరిశీలించారు. సకాలంలో విధులకు హాజరయ్యారో లేదో ఆరా తీశారు. ఆ ప్రాంతంలో కాలినడకన వెళుతూ చెత్త సేకరణ తీరు, డ్రైనేజీల నిర్వహణ, తడి–పొడి చెత్తను విభజించి ఇస్తున్న విధానాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న డీసిల్టేషన్ పనులను కూడా పరిశీలించారు. వర్షాలు పడే లోపుగా నగరంలోని అన్ని ప్రాంతాలలో పూడికతీత పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ముఖ్యంగా పారిశుధ్య కార్మికులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరై మెరుగైన పనితీరు కనబరిచేలా పర్యవేక్షించాలని ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు కూడా ఉన్నారు.

మంత్రి అప్పలరాజుకు వినతి


మంత్రి అప్పలరాజును కలిసిన సంఘం అధ్యక్షుడు పరశురాం, కార్యవర్గ సభ్యులు

బాలాజీచెరువు: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పశు, మత్స్యశాఖామంత్రి సిదిరి అప్పలరాజును శుక్రవారం కాకినాడ జిల్లాపరిషత్‌లో జిల్లా మత్స్య సహాయకుల సంఘం అధ్యక్షుడు చాగంటి పరశురాం ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కలిశారు. 2019 ఎమెండ్‌మెంట్స్ ప్రకారం ప్రమోషన్ ప్యానల్‌లో మత్స్య సహాయకులకు అర్హత కల్పించాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందించి మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబుకు తెలియజేస్తానన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీవీ సత్యనారాయణ, మణికంఠ, రాహుల్, చిరుహాస్, సురేష్, శ్రీనుబాబు పాల్గొన్నారు.

రేపు స్వరాభిషేకం సంగీత విభావరి

కాకినాడ కల్చరల్: స్థానిక గాంధీనగర్ పార్కు ప్రాంగణంలోని కళావేదిక వద్ద వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్వరాభిషేకం పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పి.వీరభద్రరావు తెలిపారు. సంగీత అభిమానులు హాజరు కావాలని కోరారు.

వేగంగా గృహనిర్మాణాలు

- అధికారులతో కమిషనర్ సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: జిల్లా కేంద్రం కాకినాడ ప్రజలకు స్థలాలు కేటాయించిన కొమరగిరి, ఏపీత్రం, పండూరు లేఅవుట్లలో గృహనిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్‌రావిరాల ఆయాశాఖలను ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం కార్పొరేషన్, హౌసింగ్, మెప్మా తదితర శాఖల అధికారులతో గృహనిర్మాణ ప్రగతిని సమీక్షించారు. లేఅవుట్ల వారీగా ఎంతమంది లబ్ధిదారులు?, ఎంతమంది ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు? ప్రస్తుతం ఏఏ దశల్లో ఉన్నాయి? వంటి అంశాలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణ లబ్ధిదారులుగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35వేలు బ్యాంకు లింకేజీ కల్పించే అంశంపై కూడా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుత వాతావరణం గృహనిర్మాణాలకు అనువుగా, అనుకూలంగా ఉన్నందున ఆయాశాఖల సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పట్నాయక్, ఈఈ గుప్తా, మెప్మా పీడీ ప్రియంవద, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, డిప్యూటీ సిటీప్లానర్ హరిదాసు, పలువురు డీఈలు, ఏఈలు సమావేశానికి హాజరయ్యారు.

పిఠాపురం చరిత్ర పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, అతిథులు

బాలాజీచెరువు: ఆదిత్య పాఠశాలలో శుక్రవారం ప్రముఖ రచయిత ర్యాలీ ప్రసాద్ రచించిన పిఠాపురం చరిత్ర పుస్తకం ఆవిష్కరణ నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పిఠాపురం రాజా రత్నారావు, పిఠాపురం జెడ్పీటీసీ సభ్యుడు బుర్రా అనుబాబు, బాదం ఉదయ్ సూర్యప్రకాష్ పాల్గొని పిఠాపురం విశిష్టత తెలియజేశారు. నేటి యువతకు పిఠాపురం పరిపాలించిన రాజుల చరిత్ర తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పుస్తక రచయిత ర్యాలీ ప్రసాద్ తండ్రి ర్యాలీ వెంకట్రావును సత్కరించారు. పిఠాపురం ప్రముఖులు పాల్గొన్నారు.

దొంగలుంటారు జాగ్రత్త

కాకినాడ రూరల్: వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ కోరారు. మండలంలోని రమణయ్యపేట గ్రామ పరిధిలోని రాయుడుపాలెం శేషాద్రినగర్‌లో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం రవి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా దొంగతనాలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ రాయుడుపాలెం, శేషాద్రినగర్ ప్రాంతాలలో వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరైనా వేసవిలో ఇతర ప్రాంతాలకు వెళ్ల వల్సి వస్తే ఇంటికి తాళాలు వేయడంతో పాటు పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా నిఘా ఉంచుతామన్నారు. ముఖ్యంగా పిల్లలకు వేసవి సెలవులు అని చాలామంది ఊళ్లు వెళుతుంటారని అటువంటి వారు బంగారు ఆభరణాలు, నగదు ఇండ్లలో ఉంచవద్దన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సచివాలయం మహిళా పోలీసు ఫర్జానా లాక్ హౌస్ మానిటరింగ్ ఏ విధంగా చేపడతారో వివరించారు. లింగం రవి మాట్లాడుతూ వేసవిలో అనుమానిత వ్యక్తులు సంచారం ఎక్కువగా ఉంటుందని, వారిపై నిఘా ఉంచాలన్నారు. రాత్రి పూట అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసరావు, సాయి కుమార్, బాల కనక దుర్గమ్మ ఆలయ కమిటీ అధ్యక్షురాలు మీనవల్లి తలుపులమ్మ, రిటైర్డ్ పోలీసుల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చక్రధరరావు, కాలనీ ప్రెసిడెంట్ వరప్రసాద్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

వైభవంగా పైలమ్మ జాతర

కాకినాడ: కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరున్న పైలమ్మ జాతర మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. స్థానిక అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలో జరిగిన ఈ జాతరకు సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో పాటు జాతరలో పాల్గొని తిరుబొమ్మ కార్యక్రమాన్ని తిలకించారు. కార్పొరేటర్ ఎంజీకే కిషోర్, కమిటీ ప్రతినిధులు కోకా సత్తిబాబు, వాసంశెట్టి రాజు, రాయపల్లి శ్రీనివాసరావు, కోకా వెంకటగిరి, గ్రంధి విష్ణు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై శ్రద్ధ వహించాలి


శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలాజీచెరువు: వయస్సుతో సంబంధం లేకుండా దంత సంరక్షణపై శ్రద్ధ వహించాలని సూపర్‌బజార్ చైర్మన్ ముమ్మిడి గోవిందు పేర్కొన్నారు. జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్, శ్రీసూర్యచంద్ర దంత వైద్యశాల సంయుక్తంగా సూపర్‌బజార్, నాగమల్లితోట జంక్షన్ ప్రాంతాలలో శుక్రవారం ఉచిత దంత శిబిరం నిర్వహించారు. దాదాపు 100 మందికి పైగా దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సూపర్‌బజార్ సీఈఓ శివాజీ గణేష్, శ్రీసూర్యచంద్ర దంత వైద్యులు డాక్టర్ కమల, డాక్టర్ శివానీ, జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవితేజ, ప్రాజెక్టు చైర్మన్ భూశంకర్, సభ్యులు డాక్టర్ సలాది సూర్యకిరణ్, కృష్ణ, రమేష్, సతీష్‌సత్య, రమ్య, సుబ్రమ్మణ్యం, భద్రం, సంతోష్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కరప: ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు చైతన్య గోదావరి గ్రామీణబ్యాంక్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జనసురక్ష ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ అన్నారు. నడకుదురులో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వంటి ఇన్సూరెన్స్ పథకాలను, కిసాన్ క్రెడిట్‌కార్డ్, ఇతర బ్యాంక్ కార్యకలాపాలు వివరించారు. స్థానిక గ్రామీణబ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ ఖాతాదారులకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గ్రామసర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిడి బుచ్చిబాబు, పైలా రామతులసి, గోవిందు, మండల ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.